క్లుప్తంగా

నూకాలమ్మకు వెండి వడ్డాణం బహూకరణ



వడ్డాణం సమర్పిస్తున్న దాతలు

మామిడికుదురు: మామిడికుదురు గ్రామ దేవత శ్రీ నూకాలమ్మ వారి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ ఉండు కృష్ణారావు కుటుంబ సభ్యులు వెండి వడ్డాణాన్ని ఆదివారం బహూకరించారు. జల్లి కృష్ణకుమారి, తోటే సదా సాయి, ఉండ్రు వాణి శ్రీ, యాడ్ల మహాలక్ష్మి, గంటి రాధ, గెద్దాడ యాష్టకాయ, గెద్దాడ ఆనంద్‌కుమార్, భోము ఇందిరా ప్రియాదర్శిని, ఉండ్రు శ్రీ రామారావు, ఉండ్రు హేమాంజలి రూ.64 వేల విలువైన 700 గ్రాముల వెండి వడ్డాణాన్ని అమ్మవారికి సమర్పించారు. అంతకుముందు వడ్డాణానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా గంగాలమ్మ జాతర



గంగాలమ్మ తల్లి

మామిడికుదురు: నగరం గ్రామ దేవత దొడ్డి గంగాలమ్మ జాతర మహోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. చిత్ర విచిత్ర వేషధారణలు, బాణ సంచా కాల్పులు, గరగ నృత్యాల నడుమ జాతర ఆద్యంతం కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారికి ఆదివారం భక్తులు నైవేద్యాలు చెల్లించారు. నాలుగు రోజుల పాటు జరిగే అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకొని విద్యుత్ దీపాల అలంకరణలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

ఎస్సీ ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ సంక్షేమ కమిటీ ఏర్పాటు



నూతన కమిటీకి నియామక పత్రం అందిస్తున్న సంజీవకుమార్

రావులపాలెం: ఆత్రేయపురం మండల ఎస్సీ ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ నియామకం ఆదివారం జరిగింది. మండలంలోని రావులపాడు జమిందార్ కాంప్లెక్స్‌లో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చింతా సంజీవకుమార్ అధ్యక్షతన జరిగింది. ఆత్రేయపురం మండల కమిటీతో పాటు జిల్లా కార్యదర్శిని నియమించినట్టు సంజీవకుమార్ తెలిపారు. ఆత్రేయపురం మండల కమిటీ అధ్యక్షుడిగా నల్ల రామకృష్ణ, కార్యదర్శిగా రాపాక మధుబాబు, ఉప కార్యదర్శిగా దిడ్ల రమేష్, కొత్తపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కొలుకుల నాగేశ్వరరావును నియమించినట్టు తెలిపారు.


వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మంటపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలతోను, మంగళ వాయిద్యాల నడుమ కనుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు ఆధ్వర్యాన అర్చకులు, వేద పండితులు ఈ కల్యాణం నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ పి.విజయ సారథి, భక్తులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

రావులపాలెం: కిడ్నీ, లివర్ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి స్థానిక శ్రీ కాశీఅన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు రూ.10 వేలు సాయం అందజేశారు. రావులపాలెం కాలువ అవతల గల అంధుల హాస్టల్ నిర్వాహకుడు సింహాద్రి కొన్ని రోజులుగా కిడ్నీ, లివర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇతని వైద్య ఖర్చుల నిమిత్తం శ్రీ కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు ఆదివారం అతని ఇంటికి వెళ్లి సాయం అందజేశారు.

పౌష్టికాహారంగా మునగాకు..

అంగన్‌వాడీల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ



జి.అగ్రహారం అంగన్‌వాడీలో భోజనం చేస్తున్న చిన్నారులు

అంబాజీపేట: పిజ్జా, బర్గర్‌లు, ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడి ఆకు కూరలను ప్రస్తుత యువత పూర్తిగా మరచిపోయింది. ఆకు కూరల్లో లభించే పోషకాలు, వాటి విలువలను చిన్నతనం నుంచి తెలియజేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. అందులో భాగంగా మునగ చెట్ల ఆకుల్ని వారానికి రెండు రోజులు అందజేసే ప్రక్రియ విజయవంతంగా నడుస్తోంది. మునగ ఆకు పప్పు, మునగ ఆకు రసం, లేదా కూర రూపంలో వారానికి రెండు రోజులు అందజేయడం ద్వారా వారికి పౌష్టికాహారం సమృద్ధిగా లభిస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పెరటిలో ఆకు కూరలు, మునగ మొక్కల్ని పెంచాలని ప్రభుత్వం సూచించింది. మునగ ఆకులో ఐరన్, విటమిన్ ఏ, సీ, యాంటీ ఆక్సిడెంట్స్, కాల్షియం, అమినో యాసిడ్స్, ఫాస్పరస్, ప్రొటీన్లు, క్లోరోజెనిక్ యాసిడ్, నీరు, పిండి పదార్థాలు, ఫ్యాట్స్, మాంసకృతులు ఉంటాయి. ఇలాంటి బలవర్ధక ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్నారు. మునగ రక్తహీనతను తొలగిస్తుంది కంటి చూపును మెరుగుపరుస్తుంది. వ్యాధి నిరోధక శక్తిని అందిస్తుంది. గర్భిణుల్లో పిండం ఆరోగ్యంగా ఎదిగేందుకు దోహదపడుతుంది. ఎముకల పటుత్వంతో పాటు థైరాయిడ్ సమస్యల్ని తగ్గిస్తుంది. బాలింతల్లో పాల ఉత్పత్తిని పెంచుతుంది. సుఖ ప్రసవానికి సహకరిస్తుంది. ఆరోగ్యకరమైన కొవ్వును అందిస్తుంది. రక్తంలో సుగర్ స్థాయిల్ని తగ్గిస్తుంది. ఆస్తమా, టీబీ, పొడి దగ్గు దరికి చేరనివ్వవు. మహిళలకు మునగాకు వరప్రదాయిని.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఒక వరం

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా వారంలో ప్రతి శుక్రవారం ముగన ఆకు, పప్పుకూర, మరో రెండు రోజులు బుధ, గురువారాల్లో ఆకుకూరల పప్పును అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్నారు. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాలకు సంబంధించి 711అంగన్‌వాడీ కేంద్రాల్లో 9,826 మంది చిన్నారులు, 6040 మంది గర్భిణులు, 5,890 మంది బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోను మధ్యాహ్న భోజనంలో మునగాకు తప్పనిసరిగా వేస్తున్నారు. వారానికి రెండుసార్లు మునగాకు కూరను విద్యార్థులకు వడ్డిస్తున్నారు. ఆకుకూరల వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు, బాలింతలకు, గర్భిణులకు వివరిస్తూ వారిని చైతన్య పరుస్తున్నారు.

మునగాకులో మంచి పోషకాలు



గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాలున్న ఆహారం అందజేస్తున్నాం. మునగ ఆకును పప్పు కూరగా ఒక రోజు ఇస్తున్నాం. మునగాకులో విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉన్నాయి.

–కేవీఎల్‌డీ కుమారి, సీడీపీఓ, అమలాపురం

రక్తహీనత ఉండదు



అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు ఆకు కూరలతో పాటు మునగాకు కూర కూడా పెడుతున్నాం. మునగాకు తీసుకుంటే రక్తహీనత ఉండదు. ఎముకల పటుత్వం పెరుగుతుంది. ఆకు కూరల్లో ఉండే పోషక విలువలను వివరిస్తున్నాం.

– ఎం.రమాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, అంబాజీపేట

ముగిసిన శ్రీరామ సప్తాహం



సప్తాహంలో పాల్గొన్న దంపతులు, భజన బృందం

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో రామాలయం వద్ద నిర్వహించిన తొమ్మిదో శ్రీరామ సప్తాహ మహోత్సవం ఆదివారం ముగిసింది. జిల్లాలోని ప్రముఖ భజన బృందాలు వారం రోజుల నుంచి భక్తి కీర్తనలను ఆలపించడంతో గ్రామం అంతటా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రాజమహేంద్రవరం నుంచి వచ్చిన మహిళా భక్త భజన కళాకారులు ఆలపించిన రామాయణంలోని పలు ఘట్టాలకు చెందిన పద్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అంగరకు చెందిన వెంకన్నకాపు బృందం ఉదయం, రాత్రి వేళల్లో నిర్వహించిన పవళింపు సేవ, మేల్కొలుపు సేవ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. శ్రీరామ సప్తాహ మహోత్సవంలో పీటలపై కూర్చుని పూజలు నిర్వహించిన దంపతుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ పూజా ద్రవ్యాలను స్థానిక పెద్దకాలువలో నిమజ్జనం చేసింది.

వైభవంగా జనార్దనస్వామి కల్యాణం



ఆలమూరులో వేంచేసియున్న శ్రీజనార్దనస్వామి

ఆలమూరు: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక ఆలయ ఆవరణలో వేద పండితులు పెద్దింటి వెంకటరమణ ఆచార్యులు, పెద్దింటి విశ్వనాథశాస్త్రి, అంగర సింగరాచార్యులు, అంగర సత్యనారాయణచార్యులు మంత్రోచ్చారణల మధ్య దేవతామూర్తుల విగ్రహాలకు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాయని అనురాధ గాత్ర కచేరి విశేషంగా ఆకట్టుకుంది. వంటిపల్లి విశ్వనాథం, వెత్సా నెహ్రూ, సుబ్బరాజు సహకారంతో ఆలయ కమిటీ ఈ మహోత్సవాలను నిర్వహించింది.

ఆ ఫలితాలు అన్ని వర్గాల అభిప్రాయం కాదు

మామిడికుదురు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు అన్ని వర్గాల ప్రజల అభిప్రాయం కాదని జిల్లా వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఆదిత్యకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నాలుగు కోట్ల ఓటర్లలో ఇప్పుడు ఓటు వేసింది ఎనిమిది లక్షలే అని గమనించాలన్నారు. ఈ ఫలితాలతో ఏదో జరుగుతుందని టీడీపీ అనుకోవడం హాస్యాస్పదం అన్నారు. గతంలో ఈ ఎన్నికల్లో వామపక్షాలు, పీడీఎఫ్, యూనియన్‌లే పోటీ చేసేవని ఈసారి ప్రయోగాత్మకంగా బరిలో నిలిచిన వైఎస్సార్ సీపీని ఉపాధ్యాయులు ఆదరించి రెండు స్థానాల్లో గెలిపించారని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలు, అందిస్తున్న సుపరిపాలనకు ప్రజలు జేజేలు పలుకుతున్నారన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం తథ్యమని 2019 ఎన్నికల తర్వాత స్థానిక సంస్థలు, తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ రికార్డు విజయాలు సాధించడం ఇందుకు నిదర్శనం అని తెలిపారు.

విద్యార్థుల అపూర్వ కలయిక

53 ఏళ్ల తరువాత తొలిసారి ఆత్మీయ సమ్మేళనం



గురువులతో గ్రూపు ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

కొత్తపేట: స్థానిక జిల్లా పరిషత్ హైయర్ సెకండరీ స్కూల్ (నేటి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల) 1970 బ్యాచ్ విద్యార్థులు వారు. వారందరూ దాదాపు 65 నుంచి 70 ఏళ్ల వయసు పైబడిన వారే.. సుమారు 53 ఏళ్ల తరువాత ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఆదివారం కలుసుకున్నారు. ఈ అపూర్వ కలయికకు స్థానిక తాలూకా ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనం వేదికైంది. 1970 సంవత్సరంలో సెవెన్త్ ఫారం లాస్ట్ బ్యాచ్ విద్యార్థులు వారు. వారందరూ ఉద్యోగ, ఉపాధి పేరిట ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని వివిధ ప్రాంతాలతో పాటు సుదూర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వారంతా ఎట్టకేలకు స్థానికులైన కీర్తి వీవీఎస్ఎన్ మూర్తి, సలాది మునిభాస్కరరావునాయుడు, తొగరు సీతారామాంజనేయులు, కోట్ల విజయసారథి, చామకూర అమ్మిరాజు తదితరుల ఆధ్వర్యంలో 40 మంది కుటుంబ సభ్యులతో కలుసుకున్నారు. ఆ ప్రాంగణానికి వస్తూ వస్తూనే తారతమ్యాలు మరచి నాడు ఏవిధంగా పలకరించుకునేవారో అలాగే ఒకరినొకరు అలింగనం చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. అలనాడు ఆ పాఠశాలలో గడిపిన రోజులు.. అల్లరి చేష్టలు.. ఉపాధ్యాయుల క్రమశిక్షణ.. నేర్చుకున్న విద్య.. ప్రస్తుతం ఏఏ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.. ఎప్పుడు రిటైరయ్యారు.. పిల్లలు ఎంతమంది? వారు ఏఏ స్థాయిల్లో స్థిరపడ్డారు? మనవలు ఎంతమంది? వంటి విషయాలతో పరస్పరం కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఈ విధంగా అంతా ఒక్కటై.. చిన్న పిల్లలై నాటి కబుర్లు నెమరు వేసుకున్నారు.. ఆనందానుభూతికి లోనయ్యారు. వయోభారాన్ని లెక్కచేయకుండా వచ్చిన ఆనాటి గురువులు నల్లా సత్యనారాయణమూర్తి, మండిగల సహస్రాకారం, దంగేటి నారాయణ, పొన్నాడ భీమశంకరం లను సాదరంగా ఆహ్వానించి, వారితో ఆత్మీయ అనురాగాలను పంచుకున్నారు. వారిని ఘనంగా సత్కరించుకుని గురుభక్తిని చాటుకున్నారు. అలా ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉత్సాహంగా గడిపారు.

చిన్నారుల ఆరోగ్యానికి పెద్ద ప్రయత్నం

- సామ్–మామ్ ద్వారా శిశు సంరక్షణ
- అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య పరీక్షలు



ఆలమూరులో అంగన్‌వాడీ రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీఓ గజలక్ష్మి

ఆలమూరు: గర్భం దాల్చిన నాటి నుంచి ఆరోగ్యకరమైన శిశువు జన్మించే వరకూ ఆ మహిళల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ఐసీడీఎస్ కృషి చేస్తుంది. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని నిజం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మహిళ, శిశు సంక్షేమ శాఖ ద్వారా నిధులను వెచ్చిస్తూ వైఎస్సార్ సంపూర్ణ ఆరోగ్య పోషణ ద్వారా ఆరు సరకులతో కూడిన కిట్లను అందజేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మళ్లీ సామ్–మామ్ పథకాన్ని ప్రవేశపెట్టి నిర్దేశించిన సమయంలో చిన్నారులకు ఐసీడీఎస్ శాఖ వైద్య పరీక్షలు నిర్వహిస్తోంది. పొరపాటున ప్రమాదకరమైన వ్యాధులు సోకితే సత్వరమే మెరుగైన వైద్య సాయానికి సామ్–మామ్ దోహదపడుతుంది. వైద్యారోగ్యశాఖ ద్వారా ఎప్పటికప్పుడు ఆరోగ్య రక్షణకు సూచనలు, సలహాలను అందిస్తూ ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. క్లస్టర్ పరిధిలోని కపిలేశ్వపురం, కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి.

సామ్–మామ్ నిర్వహణ ఇలా..

104 వాహనం ద్వారా సీనియర్ వైద్య నిపుణులతో సివియర్ అక్యూట్ మాల్ న్యూట్రిషియన్ (సామ్), మోడరేట్ అక్యూట్ మాల్ న్యూట్రిషియన్ (మామ్) పేరిట అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఆరేళ్ల బిడ్డ వరకూ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే విద్యార్థుల ఎత్తు, బరువును కొలిచి ఐసీడీఎస్ శాఖ రూపొందించిన యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. సామ్–మామ్ నిబంధనల మేరకు తక్కువ బరువు ఉన్న చిన్నారులకు సమీప ఆరోగ్య కేంద్రంలో ప్రతి 15 రోజులకొకసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కండరాల బలహీనత, రక్తహీనత ఉన్నవారిని గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు. మూడు నెలలు వైద్య పరీక్షలు చేసి పౌష్టికాహారాన్ని అందించినా మార్పు రాని పక్షంలో జిల్లా ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్సను అందజేస్తున్నారు.

మూడు నియోజకవర్గాల్లో పరీక్షల తీరు ఇలా..

కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో 693 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కొత్తపేట నియోజకవర్గంలో ఉన్న 280 కేంద్రాల్లో 7,572 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 37 మంది ఎత్తు, బరువు తక్కువ ఉన్నట్టు గుర్తించారు. రాజోలు నియోజకవర్గంలోని 215 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 6,080 మంది చిన్నారులకు పరీక్షలు నిర్వహించగా 45 మంది, పి.గన్నవరం నియోజకవర్గంలో 198 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 4,914 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించగా 32 మంది ఎత్తు, బరువు తక్కువ ఉన్నట్టు గుర్తించారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతి నెలా పౌష్టికాహారం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా 2020 సెప్టెంబర్ ఏడున ప్రవేశపెట్టిన వైఎస్సార్ సంపూర్ణ ఆరోగ్య పోషణ పథకం ద్వారా మాతా శిశు సంరక్షణకు కింద ప్రతి నెలా గర్భిణులు, బాలింతలకు వివిధ రకాల పౌష్టికాహారం అందిస్తున్నారు. రాగి పిండి (కిలో), అటుకులు (కిలో), వంట నూనె (అర కిలో), సజ్జ లేక జొన్న పిండి (కిలో), రోజుకు 200 ఎంఎల్ చొప్పున నెలకు ఐదు లీటర్ల పాలతో పాటు బియ్యం, బెల్లం, చిక్కి, కోడిగుడ్లు, కందిపప్పును క్రమం తప్పకుండా అందిస్తున్నారు. చిన్నారులకు ప్రతి నెలా 2.5 కేజీల బాలమృతం ప్యాకెట్‌ను పంపిణీ చేస్తున్నారు.

మెరుగైన రక్షణ



వైఎస్సార్ సంపూర్ణ ఆరోగ్య పోషణ కిట్ల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు మెరుగైన ఆరోగ్య రక్షణ లభిస్తుంది. వారిలో పౌష్టికాహార లోపం, రక్తహీనత తగ్గి శిశు, మాతృ మరణాల నివారణకు తోడ్పాటును అందిస్తుంది. సామ్–మామ్ కార్యక్రమం ద్వారా గుర్తించిన పిల్లలకు ఈ పౌష్టికాహారాన్ని అదనంగా ఇస్తూ ఎప్పటికప్పుడు మెరుగైన చికిత్సను అందజేస్తున్నాం.

– అధికారి గజలక్ష్మి, సీడీపీఓ, కపిలేశ్వరపురం

కలవరపెడుతున్న అకాల ముసురు

అంబాజీపేట: మండుటెండల వేళ అకాల వర్షాలు ప్రజలను కలవరపెడుతున్నాయి. చెదురుమదురుగా కురుస్తున్న ప్రస్తుత వర్షాలతో పంటలకు ఏ మాత్రం నష్టం లేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఆకాశం మేఘావృతం కావడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. అకాల వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మరోపక్క వర్షాలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. భిన్నవాతావరణం నెలకొనడంతో చలిగాలు వీస్తున్నాయని ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి వి.గౌతమి, ఎ.ఇంద్రావతి, జి.వి.గీతాంజలి సూచించారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో కాచి చల్లార్చిన మంచి నీటిని తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

సీపీఐ నాయకుడికి నోటీసులు

మలికిపురం: ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 20వ తేదీన చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలోని దిండి గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్‌కు పోలీసులు ఆదివారం నోటీసులు అందించారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు అనుమతి లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొత్తపూల ఉత్సవాల ముగింపు



చింతలూరులో కొత్తపూల ఉత్సవాల ముగింపు సందర్భంగా అలరించిన గరగ నృత్యాలు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసియున్న శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయంలో పక్షం రోజుల నుంచి జరుగుతున్న కొత్తపూల ఉత్సవాలకు దేవదాయశాఖ ముగింపు పలికింది. స్థానిక ముఖ మంటపం ఆవరణలో శనివారం రాత్రి నిర్వహించిన కొత్తపూల ఉత్సవాలను తిలకించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలి వచ్చారు. మోదుగపూలను అలంకరించిన గరగకు పూలు, అగరవత్తులు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన శక్తివేషాలు, విచిత్ర వేషధారణలు, కోయ నృత్యాలు, తదితర వినోద కార్యక్రమాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. సోమవారం నుంచి జరుగనున్న నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాల్లో భాగంగా తీర్థంలో పలు రకాల దుకాణాలను ఏర్పాటు చేశారు. రంగుల రాట్నాలు, జెయింట్‌వీల్ వంటి వినోద సాధనాలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే విద్యుత్ అలంకరణ, చలువ పందిళ్ల ఏర్పాటు పూర్తయ్యింది.

సూర్యారావుపేటలో ఆకట్టుకున్న చిన జాగరణ

మండలంలోని సూర్యారావుపేటలో చింతలూరు నూకాంబిక అమ్మవారి చిన జాగరణ అత్యంత వైభవంగా జరిగింది. బ్యాండు మేళాలు, సన్నాయి వాయిద్యాల మధ్య గరగ రూపంలో ఉన్న అమ్మవారికి ఘన స్వాగతం పలికారు. చర్మ వాయిద్యాల దరువుకు అనుగుణంగా ఆలయ ఆసాదుల బృంద సభ్యులు గరగలను నెత్తిన ధరించి చేసిన గరగ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

తాటాకిల్లు దగ్ధం

రూ.3 లక్షల ఆస్తి నష్టం

అల్లవరం: సామంతకుర్రు పంచాయతీ పరిధిలోని నీలగిరి కాలనీలో కొప్పాడి కనకరాజుకి చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం సాయంత్రం అగ్నికి ఆహుతైంది. రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని బాధితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. బాధితులను సర్పంచ్‌లు సుందరనీడి సాయి, కొల్లు వెంకటరమణ, ఎంపీటీసీ కర్రి సత్య శ్రీను తదితరులు పరామర్శించారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

తాళ్లరేవు: ఒక వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు కోరంగి ఎస్‌ఐ పి.శ్రీనివాస కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ప్రధాన రహదారిలోని పోస్టాఫీసు సమీపంలో వృద్ధురాలైన యాళ్ల సూర్యకాంతం తన కుమార్తె ఇంటికి నడిచి వెళుతుండగా తెలుపు రంగు మోటార్ బైక్ వచ్చిన ఇద్దరు వ్యక్తులు అకస్మాత్తుగా బంగారు గొలుసును లాక్కుని యానాం వైపుకి వెళ్లిపోయినట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.40 వేలకు పైగా ఉంటుందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆ సెంటర్‌లో టెన్షన్



ప్రమాద భరితంగా ఉన్న ముక్కామల నాలుగు రోడ్ల సెంటర్

అంబాజీపేట: ముక్కామల నాలుగు రోడ్ల సెంటర్‌లో ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేవని తక్షణమే ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. ఈదరపల్లి నుంచి కొత్తపేట వెళ్లే వాహనాలు ముక్కామల సెంటర్ వద్దకు వచ్చేసరికి కనీస నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారం నడుపుతున్నారని, ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంతో హడలిపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే నాలుగు రోడ్ల సెంటర్‌లో స్పీడు బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ముగిసిన వారాహి అఖండ హోమం

అమలాపురం రూరల్: స్థానిక విద్యుత్‌నగర్‌లో గౌతమ మహర్షి అక్షయపాత్ర ఆధ్వర్యంలో 175 రోజులు నిర్వహించిన వారాహి అఖండ హోమం ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన మహాపూర్ణాహుతితో ముగిసింది. అర్చకుల ఆధ్వర్యంలో అఖండదీప, కలశ, పీఠ, ఆవరణ దేవతల ఉద్వాసన, మంత్ర జల సంప్రోక్షణ, మహదాశీర్వాదంతో అఖండ హోమం కన్నుల పండువగా జరిగింది.